# కథ ఒకే ఒక జీవితం



## కేశిరాజు ఫణిప్రసాద్

"మా నాన్నగారు ఇలా మారిపోతారనుకోలేదు" ఈ మాటలన్న రఘుని చూస్తూ అలాగే ఉండిపోయాను. రఘు నా ఆప్తమిత్రుడైన జగన్నాధరావు కొడుకు. నేను, జగన్నాధరావు కలిసి ఒకే ఆఫీసులో ముప్పయి సంవత్సరాలు పనిచేశాం.

జగన్నాధరావుకి ఒక కొడుకు, ఒక కూతురు. కొడుకు స్వతహాగా తెలివైనవాడు. చక్కగా చదువుకుని ఉద్యోగం చేస్తూ, మంచిపిల్లని పెళ్ళి చేసుకుని సుఖంగా ఉన్నాడు. ఇక జగన్నాధం కూతురు కూడా బాగా చదువుకుంది. మంచి సంబంధం చూసి జగన్నాధం పెళ్ళి చేశాడు.

జగన్నాధం రిటయిరయిపోయేనాటికి కుటుంబం పూర్తిగా స్థిరపడింది. రఘు వయసురీత్యా ఈ తరానికి చెందినవాడే. కాని అతని స్వభావం వేరు. పెళ్ళి చేసుకుని, తనతో పాటు తన తల్లిదండ్రులు కూడా తనతోనే ఉండాలనుకుంటాడు. కాని అక్కడే వచ్చింది చిక్కు.

ఉద్యోగంలోంచి రిటైరయ్యాక జగన్నాధం వేరే ఊళ్ళోనే ఉంటున్నాడు.

జగన్నాధం ప్రవర్తనకి అతని కొడుకు ఎటూతోచని పరిస్థితిలో ఉండి పోతున్నాడే తప్ప ఏమీ చెయ్యలేకపోతున్నాడు. ఏమాత్రం తీరుబడి దొరికినా తన మనసులోని బాధ నాతో చెప్పి మాట సహాయం చెయ్యమని అడుగుతుంటాడు! ఇవాళ ఆదివారం కావటంతో అదే విషయం మరిన్ని వివరాలతో నాతో మాట్లాడుతున్నాడు.

నా తోటి ఉద్యోగులు, స్నేహితులు, ఎప్పుడూ "మా నాన్నగారొస్తున్నారు మాకు సెలవు కావాలని, మా అమ్మ నాన్నలతో పాటు తీర్థయాత్రలకు వెడుతున్నాం 'ఎల్.టి.సి.అప్లై చేశాను" అనే వాళ్ళందరి మాటలు వింటూంటే అటువంటి అదృష్టం నాకు కలగటంలేదు" అనే రఘు మాటల్లో అతని బాధ వ్యక్తమవుతోంది.

రఘు కళ్ళలో నీళ్ళు, నా హృదయం చెమ్మగిల్లుతోంది.

"చూడు రఘు అనవసరంగా మనసు పాడు చేసుకోకు. ప్రతీ సమస్యకూ ఎప్పుడో ఎక్కడో ఒక పరిష్కారం ఉంటుంది. ప్రస్తుతానికి నువ్వు వెళ్ళిరా" అని చెప్పాను.

అలాగేనని తలూపి వెళ్ళిపోయాడు.

పరిసరాలని మర్చిపోయి మరీ ఆలోచిస్తున్నాను.

జగన్నాధరావు ఎంతో మంచిమనిషి. కుటుంబ విషయంలో అతను ఎంతో బాధ్యతగా వ్యవహరించాడు. ఇద్దరు పిల్లల్ని ఎటువంటి లోటూ లేకుండా ఎంతో అపురూపంగా చూసుకున్నాడు.పైగా పిల్లల కోసం ఏం చెయ్యాలన్నా వెనుకాడేవాడు కాదు. అతన్ని తండ్రిగా పొందటం నిజంగా ఆ పిల్లల అదృష్టం. ఈ ఆలోచనతో నా మనసు కొంత తేలిక పడింది.

వెంటనే అనుమానం. అటువంటి మంచిమనిషి ఇలా ఎందుకు చేస్తున్నాడు? ఇది తెలుసుకోవాలి. తప్పనిసరిగా జగన్నాధరావుని కలుసుకోవాలి.

ఇంటికి వెళ్ళాను. తలుపు తాళం వేసుంది.

చీకటి పడుతూండగా వచ్చాడు. తలుపు తాళం తీస్తుంటే "ఒరేయ్ జగన్నాధం, జగన్నాధం" అంటూ పిలుస్తూ దగ్గరికి వెళ్ళాను. నన్ను చూసి ఎదురొచ్చి "ఒరేయ్ ప్రకాష్ నువ్వట్రా ఎప్పుడొచ్చావు" అంటూ ఆత్మీయంగా నన్ను చేతులతో చుట్టేశాడు.

ఇంట్లోకి తీసుకెళ్ళి లైటు వేశాడు. ఒక చిన్న గదిలో ఉంటున్నాడు. నాలో ఆశ్చర్యం. ఇల్లు చిన్నదిగా ఉంటే సర్దుకుపోయేవాడు కాదు. అద్దె ఎక్కువయినా ఎప్పుడూ విశాలమైన ఇళ్ళలోనే ఉండాలనుకున్నాడు, ఉండగలిగాడు.

వంట స్వయంగా తనే చేశాడు. కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశాం. "అవునురా ప్రకాష్ ఇంత హఠాత్తుగా వచ్చావు ఏమిటి విశేషం?"అడిగిన వాడివైపు చూస్తూ "నిన్ను చూడాలనిపించిందిరా. వెంటనే బయలుదేరివచ్చాను"ఎప్పుడొచ్చింది ఏం చేసింది వివరించి మరీ చెప్పాను.

"ఉద్యోగం చేసే రోజుల్లో సాయంత్రమవగానే పిల్లలకోసం ఇంటికి వెళ్ళేవాడివి. ఇప్పుడు వాళ్ళకే దూరంగా ఎందుకుంటున్నావు, ఎలా ఉండగలుగుతున్నావు?" అసలు విషయం కదిపాను. ఎందుకంటే పిల్లల విషయంలో వాడి స్వభావం నాకు తెలుసు.

"నిజమేరా, అప్పట్లో నాకు హృదయముంది. ఆలోచన లేదు. ఇప్పుడు ఆలోచించే హృదయంతో బ్రతుకుతున్నాను" జగన్నాధం సమాధానం వినటానికి బాగానే ఉంది కాని నాకు నచ్చలేదు. తండ్రి కోసం పరితపిస్తున్న కొడుకు గుర్తుకొచ్చాడు.

"నీ గురించి నీ పిల్లలు ఎంతో బాధపడుతున్నారు. పరాయి ఊళ్లో, అందులోను వృద్ధాప్యంలో నువ్వు ఇలా ప్రవర్తించటం ఏమీ బాగాలేదు"

నా మాటలకు నిశ్శబ్దంగా నవ్వాడు. పైగా ఆ నవ్వులో నిర్లిప్తత.

"రిటరయిన వాళ్ళు విశ్రాంతి కోరుకుంటారు. అయినవాళ్ళతో కలిసి మెలిసి ఉంటారు. కన్నవాళ్ళ ఉనికినే సహించలేని కొడుకులున్న ఈ కాలంలో, నువ్వే కావాలని, నువ్వు వాళ్ళతోటే ఉండిపోవాలని నీ కొడుకు కోడలు కూడా ఎంతో ఆరాటపడుతున్నారు" అని రఘు నా దగ్గరకొచ్చి ఎంత బాధపడ్డాడో కళ్ళకు కట్టినట్టుగా చెప్పాను.

"అన్ని విషయాలు నాకు తెలుసు. కాని నేను వాళ్ళదగ్గరుంటే వాళ్ళకి మరింత అన్యాయం చేసినవాడినవుతాను. నా వల్ల ఒక తప్పు జరిగింది. ఆ తప్పు దిద్దుకోవడానికే నేను ఇలా ఒంటరి జీవితాన్ని కోరుకున్నాను."

"నువ్వు తప్పుచేశావా?"

క్రమశిక్షణకి ప్రతిరూపం వాడి జీవితం. మనసులో ఆశ్చర్యం.

పిల్లలకోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతుంటారు. అయినా వాళ్ళ కోసం ఏమీ చెయ్యలేకపోయామనో, వాళ్ళకేదయినా తక్కువయితే అన్యాయం జరిగిపోయిందనో బాధపడుతుంటారు.

ప్రస్తుతం జగన్నాధం ఆలోచన, ఆవేదన కూడా అంతే.

"ప్రకాష్ నా పిల్లలిద్దరినీ నేను సరిగ్గా పెంచాననుకుంటావా?" జగన్నాధం ఆత్మవిమర్శ చేసుకుంటున్నాడా? అన్న అనుమానం.

"స్కూల్లో చదువుతున్నప్పుడు తన అనారోగ్యం కూడా లెక్కచెయ్యకుండా ఎంతో పట్టుదలగా పరీక్షలు రాసి మెరిట్ స్టూడెంట్‌గా పేరు తెచ్చుకుందిరా మా అమ్మాయి. ఇంజనీరింగ్‌లో సీటొచ్చినప్పుడు...

అప్పుడు ఏం జరిగిందంటే..." జ్ఞాపకం దుఃఖంగా మారిన క్షణం. అతి ప్రయత్నం మీద తనని తాను నిగ్రహించుకుంటున్నాడు. ఓదార్పుగా భుజంమీద చెయ్యివేశాను.

కాలేజీలో చేర్పించటానికి నా దగ్గర డబ్బులేదు. చుట్టాలనుకొన్నవాళ్ళని సహాయం చెయ్యమన్నాను. "నీ పిల్లల విషయంలో నీకు ముందుచూపు లేదు.వాళ్ళ చదువులకోసం, వాళ్ళ పెళ్ళిళ్ళకోసం డబ్బు వెనకేసుకోవాలనే ఆలోచనతో ఎప్పుడైనా ప్రవర్తించావా?" అంటూ నా జీవితాన్ని విమర్శించారు. నా పెంపకాన్ని వెక్కిరించారు. అందుకు బాధపడుతున్న నన్ను చూసి "మా విషయంలో బాధపడి నీ ఆరోగ్యం పాడుచేసుకోవద్దు నాన్నా" అంటూ పిల్లలు నన్ను ఓదార్చారు. స్నేహితుల సహాయంతో ఉద్యోగం చేస్తూ మా అమ్మాయి చదువుకుంది. పగటిపూట ఉద్యోగం చేస్తూ రాత్రిపూట చదువుకుని తన లక్ష్యాన్ని సాధించాడు మా అబ్బాయి.

"తోటి వాళ్ళలాగా, హాయిగా చదువుకోవలసిన నా కొడుకు, కూతురు బాధ్యతల బరువుని మోయవలసొచ్చింది. అందుకు కారణం ఎవరు? నేను. చదువులు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తూ సంపాదించిన డబ్బుతోనే తన పెళ్ళి చేసుకున్న మా అమ్మాయి ఎదుట తండ్రిగా నిలబడే అర్హత నాకుందా?"

"మరో ముఖ్యమైన సంఘటన చెపుతాను" అంటూ ఒక్కక్షణం మాట్లాడటం ఆపాడు.

"మొదట్లోనే నా కొడుకు ఆఫీసరుగా ఉద్యోగంలో చేరాడు. వాడి భార్య కూడా బాగా చదువుకుంది. డబ్బుకి ఎంతమాత్రం కొదువలేదు. ఇద్దరూ ఉద్యోగస్థులవటంతో సుఖంగా ఉంటున్నారు. నేను వాళ్ళతో ఉంటే ఈ వయసులో నా బాగోగులు చూసుకోవటానికి నా కోడలు ఉద్యోగం మానేస్తానంటోంది. ఎందుకు నా కోడలు ఉద్యోగం మానేసి నాకు సేవలు చెయ్యాలి? వాళ్ళకోసం నేనేం చేశాను? నాకే ఆలోచన రావటానికి కారణం నా బాల్యంలో అనుభవాలు".

"మా అమ్మ నాన్నలకు ఇద్దరమే పిల్లలం. నేను,నాచెల్లెలు. మా నాన్న చెల్లెల్ని 'నువ్వు మనింట్లో పుట్టిన దీపలక్ష్మివమ్మా!' అంటూ చిట్టితల్లి అని ఎంతో ఆప్యాయంగా చూసుకునేవాడు. మా నాన్న నన్ను కూడా అలాగే చూడాలని ఆశపడేవాడిని కాని ఎప్పుడూ, చదువుకోమని, పనిపాట నేర్చుకోమని తిడుతుండేవాడు. పిలవటం కూడా 'ఒరేయ్ వెధవా, ఎక్కడ చచ్చావు పిలవగానే ఇటు రారా' అంటూ కోపంగా కసురుకుంటూ మాట్లాడేవాడు. ఇదంతా చూస్తున్న మాఅమ్మ "చూడండి వాడు కూడా మన పిల్లాడే, పైగా ఒక్కగానొక్కడు, ఎప్పుడూ వాడిని ఎందుకలా తిడుతుంటారు, తట్టుకోలేని పసిమనసు ముక్కలై పోతుందండి" అంటూనన్ను వెనకేసుకొచ్చేది.



కాని మానాన్న "మగవెధవ కనుకనే చెడిపోకూడదని తిడుతున్నాను. ఇప్పటినుంచే కష్ట నిష్ఠూరం తెలుసు కోవాలి" అనేవాడు.

ఊహ తెలియని వయసు. "నాన్నలంతా ఇలాగే ఉంటారేమో" అనుకుంటూ మా నాన్న కు దూరంగా ఉంటూండేవాడిని.

కూతురుని ఎలాగైనా పెంచవచ్చు కొడుకు విషయంలో కాఠిన్యం చూపిస్తే భవిష్యత్తులో వాడెలా తయారవుతాడో.

"ఒక పక్క ఇంటిపనులు చేస్తూ మరోపక్క చదువుకుంటూ ఉండేవాడిని. ఒకరోజు ఏం జరిగిందంటే" చెప్పటం ఆపాడు. "ఆరోజు..." ఎప్పుడో జరిగిన సంఘటన తాలూకూ ప్రభావం ఇప్పుడు కూడా కళ్ళలో ఎరుపు రంగులో కనిపిస్తోంది.

"మూడు నెలల పరీక్షల్లో లెక్కల్లో నాకు తక్కువ మార్కులొచ్చాయి. ప్రోగ్రెస్ రిపోర్టు చూడగానే ఎంతో భయం. ఈరోజు నాకు మూడిందను కుంటూనే ఇంటికి వెళ్ళాను.

ఇంట్లో అడుగు పెట్టగానే మా నాన్నకి నా మార్కులు కాగితం చేతికిచ్చాను. మా చెల్లెల్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుని కబుర్లు చెపుతున్నాడాయన "ఏంటిరా" అంటూ కళ్ళజోడు పట్టుకురమ్మన్నాడు. అప్పుడు తెలుసుకున్నాను కోరి మరీ పీకల మీదికి తెచ్చుకున్నానని.

"ఏరా నువ్వు స్కూలుకి సరిగ్గా వెడుతున్నావా?" ప్రోగ్రెస్ రిపోర్టు చూడకుండానే లేచి నా జుట్టు పట్టుకుని చితకబాదేశాడు. ఒళ్ళు హూనమై పోయింది.

ఆ రాత్రి నాకు అన్నం పెట్టనివ్వలేదు. కడుపు కాలిపోతోంది. అయినా నాలో మరో ఆలోచన. మర్నాడు ఉదయం కూడా తిట్లు తింటూనే స్కూలుకి వెళ్ళిపోయాను. క్లాసురూముకి వెడుతూ హెడ్‌మాస్టారి గది లోంచి మాటలు నన్ను అక్కడే ఆపేశాయి.

"చూడండి మాస్టారు మావాడు చదువులో వెనకబడుతున్నాడు. అందుకని తండ్రిగా వాడిని తిడితే చిన్నబుచ్చుకుంటాడు. కాబట్టి వాడు బాగా చదువుకునేట్టు చూడండి" మా క్లాసులో చదువుతున్న అబ్బాయివాళ్ళ నాన్న అన్నమాటలు.

"నాన్నలందరూ ఒకలాగే ఉండరు!"మరుక్షణం మానాన్నపై నాలో కసి.

నేను పెద్దవాడినవుతున్నాను. మనసు నన్ను మించి ఎదుగుతోంది. ఇలా ఎందుకనుకోవలసొచ్చిందంటే పరీక్షల్లో మార్కులు తక్కువొచ్చినప్పటినుంచి మానాన్న నాతో పనులు చేయించటం తప్ప మాట్లాడటం మానేశాడు.ఆరోజు శనివారం. మధ్యాహ్నం స్కూలునుంచి వచ్చాను.ఆకలిగా ఉంది. కాళ్ళు చేతులు కడుక్కుని వంటింట్లోకి వెళ్ళబోతూంటే నాన్న పిలుపు వినిపించింది. "రేషన్ షాపుకెళ్ళి కిరసనాయిలు పట్టుకురా", అని అమ్మని పిలిచి రేషన్‌కార్డు,డబ్బులిమ్మన్నాడు. "ఇప్పుడేగా స్కూలు నుంచి వచ్చాడు. అన్నం తిన్నాక వెడతాడు" అన్న అమ్మతో "ఇప్పుడు వెడితేనే మంచిది. మరో గంటలో షాపు మూసేస్తారు" అన్నారు.

అమ్మ మాట్లాడలేదు. మౌనంగా కిరసనాయిలు డబ్బా తీసుకున్నాను.

రేషన్‌షాపు ముందు ఎంతోమంది జనం. లైనులో నిలబడ్డాను. నా ముందున్నది ఎంతోమంది. వాళ్ళ తరువాతగాని నాకు పొయ్యరు. ఎంత సేపవుతుందో? అనుకుంటూ నిలబడ్డాను. ఒక పక్క ఆకలి. మరోపక్క నిలబడి నిలబడి కాళ్ళు పీకేస్తున్నాయి.

తప్పదు,చెప్పిన పనిపూర్తిచెయ్యాలి. ఎక్కడ లేని ఓపికతో నిలబడ్డాను. మరి కాస్సేపయ్యాక నా వంతు వచ్చింది. చేతిలోంచి రేషన్ కార్డు రేషన్‌షాపు కిటికిలో పెట్టాను. కిటికీ తలుపులు మూసేశాడు.

"ఈ రోజు టైమయిపోయింది, వెళ్ళండి, వెళ్ళండి" బ్రతిమాలుతున్న వాళ్ళమీద షాపువాడు అరుస్తున్నాడు.

చేసేదిలేక ఎవరిమట్టుకు వాళ్ళు వెళ్ళిపోతున్నారు. నేను కూడా నీరసంగా ఇంటికొచ్చాను.

ఖాళీడబ్బాతో నన్ను చూడగానే "పని చేసుకురావాలనుకుంటే ఎలాగైనా చేసుకొస్తాడు.నీలాంటి దేభ్య మొహంగాడు ఎక్కడికెళ్ళినా జరిగేదిదే"? అంటూ అరిచాడు.

ఇందులో నా తప్పేముంది. తెలిసి కూడా అరవటమెందుకు? నాలో నేనే అనుకున్నాను. అసలు ఈయన ఏమనుకుంటున్నాడు. ఆరోజు మా నాన్నంటే అసహ్యమేసింది. నా తోటివాళ్ళు, వాళ్ళ నాన్నలు ఇంట్లో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ హాయిగా ఉంటున్నారు. అదే అని ఎన్ని విధాలుగా ఆలోచించినా జవాబుదొరకని ప్రశ్న. జవాబులేని ప్రశ్నలాంటి నా బ్రతుకుమీద విరక్తి. అదే క్షణంలో ఎన్నాళ్ళు ఇలా ఏడుస్తూ బ్రతకటం? అవును, నేను మారాలి. నా మనసుకు తోచినట్టుగా నేను బ్రతకాలని నిర్ణయించుకున్నాను.

సాధ్యమైనంతవరకు నా నిర్ణయం అమలుచేయటానికే నా ప్రయత్నం. ఒక ఆదివారం స్నేహితులతో సినిమాకి వెళ్ళాను. నా టికెట్ డబ్బులు కూడా వాళ్ళే పెట్టుకున్నారు! సినిమా

పూర్తయ్యాక సాయంత్రం అందరితో పాటు అటూ ఇటూ తిరిగాను:

చీకటి పడుతోంది. ఇంటికెడదామనుకున్నాను. మనసు ఒప్పుకోవటం లేదు. మరికాస్సేపు అక్కడా ఇక్కడా తిరగాలనిపించింది. ఇంటికెప్పుడెళ్ళినా జరిగేదొకటే నాలో మొండిధైర్యం. బాగా పొద్దుపోయాక ఇంటికి వెళ్ళాను.

ఇంటిలోపలికి అడుగుపెట్టాను. నన్ను తిడుతూ ఎదురొచ్చాడు మా నాన్న. ఆయన్ని తప్పించుకుని లోపలికెళ్ళాను. ఈసారి మరింత రెచ్చిపోయి కర్ర తీసుకుని కొట్టడానికొచ్చాడు. దెబ్బ పడబోతుంటే మా నాన్న చెయ్యిని గట్టిగా పట్టుకున్నాను.

"ఇన్నాళ్ళు కన్నతండ్రివని నువ్వేంచేసినా ఊరుకున్నాను. కసాయివాడిలా ప్రవర్తిస్తూ గౌరవం పోగొట్టుకున్నావు. ఇకనుంచి నా జీవితంలో నువ్వు జోక్యం కలిగించుకోకు. నువ్వు నువ్వే-నేను నేనే. మనిద్దరం ఒకరికొకరం ఏమీకాము" ఖచ్చితంగా చెప్పాను.

అదే ఆరోజు నేనన్న చివరిమాట. మళ్ళీ ఆయన నాతో మాట్లాడలేదు.

ఇది నా జీవితం. నాకిష్టమొచ్చినట్టు బ్రతుకుతాను. స్వేచ్ఛగా అనుకొన్నాను. జరిగిన విషయం, నేను తీసుకున్న నిర్ణయం నా దగ్గర స్నేహితులతో చెప్పాను.

"వెరీగుడ్, నువ్విలా చేస్తావని కాదు ఇలా చెయ్యాలని నిన్ను చూసినప్పుడే అనుకున్నాం" అంటూ ఒక ఫ్రెండ్ సిగరెట్ అందించాడు. మరొకడు సిగరెట్‌ని వెలిగించాడు. గట్టిగా ఒక దమ్ములాగి పొగను వదిలాను. చెప్పలేనంత హాయి.

స్నేహితులతో సినిమాలు, షికార్లు, ఎంతో సరదాగా కాలం గడిచిపోతోంది. ఇంటినుంచి బయటికి రావటం, తిరిగి ఇంటికెళ్ళటం అంతే నా యిష్టం. నేనెవరినీ లెక్కచెయ్యనక్కర్లేదు. అంతేకాదు ఇంట్లో వాళ్ళతో మాట్లాడటమే అనవసరం.

అంతా కళ్ళకెదురుగా జరుగుతున్నట్టుగా చెపుతున్నాడు జగన్నాథం. నాకు తెలియని విషయాలెన్నో జగన్నాథం జీవితంలో ఉన్నాయి.

"నా చుట్టూ ఉన్న స్నేహితులంతా నా వాళ్ళు. అవసరాలకి డబ్బులిస్తున్నారు. అంతకన్న నాకేం కావాలనుకుంటూ సుఖంగా కాలక్షేపం చేస్తున్నాను. ఇస్తున్న వాళ్ళందరి దగ్గరా డబ్బు తీసుకుంటున్నాను. కాని ఎంతనేది మాత్రం లెక్కలేసుకునేవాడిని కాదు."

కాలం గడిచింది. మనస్తత్వాలు మారాయి. నా చుట్టూ ఉన్న స్నేహితులు తమ జీవితలక్ష్యం సాధించుకోవాలని ఎవరి దారిని వారు వెళ్ళిపోతున్నారు. మరి నేను? నా జీవితగమ్యం ఎటు? నేను ఎటువెళ్ళాలి? తెలీదు ఎందుకంటే అలాంటి ఆలోచనే నాకు రాలేదు.

ఒక్కడినే కూర్చున్నాను, ఏం చెయ్యాలో తెలియటం లేదు.

"ఏమిటిరా జగన్నాథం అలా దిగులుగా ఉన్నావేమిటి?" ఉన్నవాళ్ళందరిలోనూ కాస్త పెద్దవాడు, దగ్గర స్నేహితుడు శ్రీరామ్ పక్కన కూర్చుని అడిగాడు. నా పరిస్థితి చెప్పుకున్నాను. ఏమనుకున్నాడో కాని తనతో పాటు వాళ్ళింటికి నన్ను తీసుకెళ్ళాడు.

వరండాలో కూర్చున్నాను. శ్రీరాం లోపలకెళ్ళి వాళ్ళ నాన్నగారితో మాట్లాడుతున్నాడు. "నువ్వు అతనికి సహాయం చెయ్యదలుచుకున్నావా?" వాళ్ళ నాన్నగారి మాటలకు శ్రీరామ్ అవునన్నాడు! అయితే అతనికి తను ఉన్న పరిస్థితిని అర్థమయ్యేలా చెయ్యి. "తండ్రి ఎప్పుడూ తిడుతున్నాడనే కోపంతో ఇంటిని పట్టించుకోకుండా తిరుగుతున్నాడు. కొడుకుని ప్రయోజకుడిగా చూడాలని ఆయనలా ప్రవర్తించాడు. దురుసుగా ఉంటూ ఎప్పుడూ తిట్టడం తండ్రిగా ఆయన తప్పు. అదే ఆయన మానసిక బలహీనత. కాని ఆయన ఆశయం తన కొడుకుకి మంచి జీవితమివ్వాలని!"

"మా నాన్న గురించి ఈయనకెలా తెలుసు?" అనుకుంటూ లోపలికి తొంగిచూశాను. "కాని ఆయనకు చివరకు మిగిలినదేమిటి? కొడుకు చెడిపోయాడనే బాధ. మనోవ్యథ. రెండురోజులక్రితం వీళ్ళ నాన్నని చూడటానికెడితే తెలిసిందీ సంగతి. వీళ్ళ నాన్న నాకు మంచి స్నేహితుడు." అంతే. ఇక వినలేక అక్కడినుంచి వెంటనే మా ఇంటి కొచ్చేశాను. ఇంట్లో అడుగు పెట్టాను. నిశ్శబ్దంగా ఉంది. మనసులో ఎందుకో భయం! అలాగే వంటింట్లోకి వెడుతూ అనుకోకుండా నాన్న కూర్చునే పడక కుర్చీ వైపు చూశాను.

అక్కడ నాన్న కనపడలేదు. అదే చోటులో ప్రమిదలో దీపం.

అంతే! ఒక్కసారిగా కుప్పకూలిపోయాను. కుమిలికుమిలి ఏడ్చాను. అలా ఏడుస్తూనే ఉన్నాను. ఇన్నాళ్ళు ఇంటిని ఇంట్లోవాళ్ళను పట్టించుకోకుండా తిరిగి నేను ఏమి సాధించాను. జన్మనిచ్చిన తండ్రిని చివరిసారిగా చూడలేదు సరికదా పైగా ఆయనకి తీరని బాధనే కలిగించాను. జీవితం



ఇదేనా? నేను కోరుకోవలసింది ఇటువంటి జీవితమా?"

కలుక్కుమంటున్న హృదయంలోంచి ఆలోచన!

మా నాన్నగారు సర్వీసులో ఉండగానే పోవటంతో అదే ఆఫీసులో నా అర్హతకు తగిన ఉద్యోగమిచ్చారు. ఉద్యోగంలో వచ్చే ఆదాయం కోసం నాకున్న అప్పులు ఎదురుచూస్తున్నాయి. నేను ఎవరిని నిర్లక్ష్యం చేశాను. నన్నూ నా భవిష్యత్తుని నిర్లక్ష్యంచేశాను. తండ్రి పెంపకంలోలోపం. కొడుకులో అవగాహన లోపం. ఫలితంగా రెండు జీవితాల మధ్య సంఘర్షణ.

కావొచ్చు. కాని వీడు కూడా ఒక తండ్రిగా జీవితాన్ని అర్థం చేసుకున్నాడా? తను కూడా ముందు జాగ్రత్త లేకుండా బ్రతికిన చేతకాని మనిషి.

"ఇప్పుడు బాధపడితే వెళ్ళిపోయిన కాలం వెనక్కితిరిగొస్తుందా? నువ్వు చేతులారా జారవిడుచుకున్నవన్నీ మళ్ళీ పొందగలవా? జవాబు చెప్పరా జగన్నాథం" నిలదీస్తున్నట్టుగా అడిగాను.

"ఈ నిజం నాకు తెలుసురా ప్రకాష్!" మాటల్లో మొండితనం. వింటున్న నాకు చిరాకేసింది. విసుగుతో మొహం తిప్పేసుకున్నాను.

కొద్దిక్షణాలు నిశ్శబ్దం. రెప్పల చివరనుంచి చూశాను. కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నాడు. "కష్టాలనీ జ్ఞాపకం చెయ్యటంకాదు! మనస్ఫూర్తిగా ఓదార్చి అతనికో దారి చూపించు" నాలోని స్నేహితుడు ధర్మాన్ని గుర్తుచేస్తు న్నాడు. ఆలస్యం చెయ్యలేదు. "ఒరేయ్ జగన్నాథం, తెలిసో తెలియకో ఇన్నేళ్ళ జీవితం సమస్యలతోనే చిక్కుబడిపోయింది. ఒదిలెయ్. నీ పిల్లలు నిన్ను కావాలనుకుంటున్నారు. ఆత్మీయంగా నీతో ఉండాలనుకుంటున్నారు. వాళ్ళ పిలుపును అందుకో. మీరందరూ కలిసిమెలిసి హాయిగా ఉండండి" అంటూ నేను వచ్చిన కారణం వివరంగా చెప్పాను.

నా మాటలకు జగన్నాథం "నా పిల్లలతో కలిసి బ్రతికే అర్హత నాకు లేదురా" అనగానే "ఇహ వీడు మారడు" అని అసహనంగా అనుకున్నాను. "చిన్నతనంలో అపార్థాలతో బ్రతికాను. పెద్దయ్యాక నా తెలివితక్కువతనంవల్ల పిల్లలకు మంచి జీవితాన్ని ఇవ్వలేకపోయాను. అయినా వాళ్ళు తాము కోరుకున్న జీవితాన్ని సాధించుకున్నారు. సంతోషంగా ఉన్నారు. అది చాలు నాకు. కాని నాలో అసంతృప్తి అనుక్షణం నన్ను వేధిస్తోంది" ఆశ్చర్యంగా వాడి మాటలు వింటున్నాను.

"రిటైరయినా నేను మళ్ళీ ఉద్యోగం చేస్తున్నాను. ఎందుకో తెలుసా? నన్ను నేను బ్రతికించుకుంటూ నా పిల్లలకోసం చేతనయినంత వరకు డబ్బులు వెనకేస్తున్నాను. నేను చేసిన పొరపాట్లు, తప్పులు మా కుటుంబంలో మరెవ్వరు చెయ్యకూడదు. నా పిల్లలు, వాళ్ళ పిల్లలకోసం ఎంతో శ్రమిస్తూ వీలయినంత కూడబెడుతున్నారు. అందులో నా వంతుగా నేను వాళ్ళకి సాయం చెయ్యాలి. అప్పుడే మనిషిగా నిజమైన జీవితం గడపగలుగుతాను. ఇదే నా నిర్ణయం" అన్న వాడి మాటల్లో కొత్తదనం. ఎంత మంచి ఆలోచన అనుకుంటూ వాడినే చూస్తున్నాను.

మనిషిగా పుట్టడం అదృష్టం. మనిషిగా బ్రతకటం గొప్పతనం. అదే సాధించాలి. ఎందుకంటే మనకున్నది ఒకే ఒక జీవితం.

•